



# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 26 ఏప్రిల్, 2026 | పేజీలు :08


# రైతు సమస్యలు అధికారుల దృష్టికి తేవాలి

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్తన్న





**ప్రజాపక్షం/గణపురం:**శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండల కేంద్రం లోని రైతువేదికలో మండలానికి చెందిన లబ్ధిదారులకు 47 మందికి 47,05,452/ రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి చెక్కులను భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని గణపురం, పరశురాంపల్లి, గొల్లపల్లి, చల్పూర్ లక్ష్మారెడ్డిపల్లి గ్రామాలలో పి.ఎ.సి.ఎస్ మరియు ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర 2389/ రూపాయలతో పాటుగా బోనస్ 500 రూపాయలు ఇస్తుందని తెలిపారు, వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల యొక్క ఆర్పీఎం 18 నుండి 20 వరకు , బ్లోయర్ ఆన్ లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియజేయాలని ఇలా చేయడం వల్ల ధాన్యంలో తాలు ఉండదని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తి జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులకు సమయానికి డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎం సివిల్ సప్లై రాములు, వ్యవసాయ శాఖ అధికారులు ఐలయ్య, డిసిఓ, గణపురం తాసిల్దార్ అడ్లూరి రాజేశ్వరరావు, ఎంపీడీవో భాస్కర్, సర్పంచ్ కటుకూరి రాధిక శ్రీనివాస్,స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సమాజ భాగస్వామ్యంతోనే మలేరియా నియంత్రణ


వరంగల్ జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద దేవి

**ప్రజాపక్షం/ వరంగల్ :**సమాజ భాగస్వామ్యంతోనే మలేరియా నియంత్రణకోసం కృషి చేయాలనివరంగల్ జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద దేవి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియాదినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బిసాంబశివరావు ఆధ్వర్యంలో ఎంజీఎం నర్సింగ్ స్కూల్ నుంచి ప్రారంభమైన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతోనే మలేరియా నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం నినాదం మలేరియాను అంతం చేసే దిశగా కృషి ఇప్పుడు మనం చేయగలం, ఇప్పుడు మనం తప్పక చేయాలనే స్ఫూర్తితో 2030 సంవత్సరం నాటికి మలేరియా రహిత సమాజ నిర్మాణ దిశగా అందరం కృషి చేయాలన్నారు. ప్రత్యేకించి ఆరోగ్య కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, కీటక జనిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కీటక జనిత వ్యాధుల పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వెల్ ఆపరేషన్లు నిర్వహించాలని, అదేవిధంగా ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించినఅవగాహన ప్రదర్శనశాలను ఆసక్తిగా తిలకించి పలు సూచనలు చేశారు. మలేరియా వ్యాధి నివారణ అవగాహన కోసం తయారు చేసిన కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిష్ చంద్ర రెడి, జిల్లా మలేరియా అధికారిని కే రజిని, డిప్యూటీ డిఎంహెచ్ఓలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ఫొగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, మలేరియా కార్యాలయ సిబ్బంది సదానందం, విజయేంద్ర కుమార్, మున్సిపల్ సూపర్వైజర్ మధుకర్, నాగిరెడ్డి, అంజద్ అలీ, నాగరాజు, రాధాకృష్ణ, సత్యనారాయణ, రత్నాకర్, కుమార స్వామి, నర్సి ంగ్ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది మున్సిపల్ సిబ్బంది ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వేగవంతంగా వైద్య విద్యార్థుల వసతి భవనం పనులు

## కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి:**వైద్య కళాశాల, వైద్య విద్యార్థుల వసతి భవనం (హాస్టల్)పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి, వైద్య కళాశాల ప్రిన్సిపల్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, టీజీఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో లేవని, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నప్పటికీ పనులు ఆలస్యమవ్వడం సరికాదన్నారు. పనుల్లో వేగం పెంచేందుకు లేబర్ మొబిలైజేషన్‌ను పెంచాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరపు వైద్య అడ్మిషన్లు పూర్తి అయి విద్యార్థులు కళాశాలకు రానున్న నేపథ్యంలో, అప్పటికి అన్ని నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బెడ్స్, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా।। రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా।। మధుసూదన్, టిజిఎంఎస్ ఐడిసి ఏఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులు, ప్రజలు ఆలోచిస్తే ప్రమాదాలు తగ్గుతాయి

**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో విద్యుత్ భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించేందుకు టిఎస్ఎన్పిడిసిఎల్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్లు ఏఈ చిరంజీవి తెలిపారు. నివాసిత ప్రాంతాల్లో గానీ, వ్యవసాయ పొలాల్లో గానీ విద్యుత్ లైన్ల కింద చెత్త, తగులబెట్టే చర్యలు ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించడంతో పాటు అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశముందని పేర్కొన్నారు. రైతులు ముఖ్యంగా పొలాల్లో చెత్తను కాల్చడం, వైర్ల సమీపంలో అగ్ని పెట్టడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని, విద్యుత్ భద్రత అందరి బాధ్యత అని ఏఈ చిరంజీవి స్పష్టం చేశారు.

## ప్రతి గ్రామంలో దేశవాళీ వరి వంగడాలను సాగు చేయాలి

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:**ప్రతి గ్రామంలో దేశవాళీ వరి వంగడాలను సాగు చేయాలని, సిఎస్ఏ సంస్థ శాస్త్రవేత్త రాజశేఖర్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని కళ్లెం గ్రామంలోని గ్రీన్ దునియా వ్యవసాయ క్షేత్రంలో దేశవాళీ వరి పంటలపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. రైతులకు 60 రకాల దేశాయి వరి విత్తనాలను, రైతులకు, ప్రదర్శించడం జరిగింది. శాస్త్రవేత్త రాజశేఖర్ మాట్లాడుతూ, దేశాయి వరి పంట పండించడం వలన, మనం తినడానికి శరీరానికి పోషకాలు ఈ వరిలోని లభిస్తాయని వారు తెలిపారు. రైతులు వానాకాలంలో దేశాయి వడగాలను పండించాలని, వాటికి కావాల్సిన విత్తనాలు సేంద్రియ విధానాల వలన, సిఏసెస్ సంస్థ ద్వారా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చేస్తామని వారు తెలిపారు. ఈ పంటను పండించేందుకు, రైతులకు కావలసిన శిక్షణలు అందిస్తుందని ఈ సందర్భంగా వారు వివరించారు. ఈ పంట పండించడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.మమత, ఆదర్శ ఏనుభావి రైతులు, కంపెనీ రైతులు, సిఎస్ఏ సంస్థ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే..



**ప్రజాపక్షం/తాడ్వాయి:**మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు మండలంలోని కామారం గ్రామ పంచాయతీ పరిధిలోని రెండు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్యా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి ఘనంగా సన్మానం చేసి ప్రశంస పత్రాలు(సర్టిఫికేట్లు) బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ఒక వ్యక్తి విద్యా అధ్యాయానికి ముగింపు, కొత్త జీవిత అధ్యాయానికి నాంది పలికే స్నాతకోత్సవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, అంగన్వాడీటీచర్,ఆయా మహిళలు, పాల్గొన్నా రు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలలు...

**ప్రజాపక్షం/నెక్కొండ:**రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందనే విషయాన్ని సోషల్ మీడియాలో విషయం చక్కర్లు కొడుతుంది. 2026....27 విద్యా సంవత్సరం నుండి ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్గా అభివృద్ధి చేయాలని నిర్ణయించిందని నెక్కొండ మండల విద్యాధికారి రవి నాయక్ తెలిపారు. ఈ పాఠశాలల్లో నర్సరీ నుండి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో సెమీ రెసిడెన్షియల్ విధానంలో విద్య అందించనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు సహా పలు వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విద్యలో నాణ్యత పెరుగుతుందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది మంచి అవకాశమని అభిప్రాయపడుతున్నారు.

## ఎంఎ తెలుగుకోర్సులో ప్రవేశానికి డిగ్రీ విద్యార్హత

### జానపద గిరిజన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్నకు విద్యార్థుల వినతి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ రెగ్యులర్ తెలుగు కోర్సులో ప్రవేశం పొందడానికి ఎదైనా డిగ్రీని విద్యార్హతగా ఆమోదించాలని ఎంఏ తెలుగుకోర్సు చివరి సంవత్సరం విద్యార్థులు. జానపద గిరిజన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు కోర్సు ప్రవేశాలను డిగ్రీలో ద్వితీయభాష తెలుగు తప్పనిసరిగా ఉండాలనే నియమం ఉంది. దీంతో బిటెక్, ఎంబీబీఎస్ తదితర డిగ్రీలను విద్యార్హతలు పొందిన విద్యార్థులు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు కోర్సులో దరఖాస్తు చేసుకోలేపోతున్నారు. ఈ క్రమంలోనే ఇతర విశ్వవిద్యాలయాలలో ఉమ్మడి పీజీ సెట్లో భాగంగా పీజీ తెలుగు కోర్సులలో ప్రవేశాలకు ఎదైనా డిగ్రీని విద్యార్హతగా అమోదించారు. ఈ మేరకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో కూడా ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన విద్యార్థులకు ప్రవేశం కల్పించేలా ఆమోదించేందుకు కృషి చేయాలని శనివారం వరంగల్ జానపద గిరిజన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్నకు విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని తెలుగు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులకు వివరిస్తానని పీఠాధిపతి వెంకన్న తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వసంత్ కుమార్, పవన్ కళ్యాణ్, బీమన్న, లోకేష్, స్వాతి, జ్యోతి తదితర విద్యార్థులు ఉన్నారు.

## మక్కలు కొనడంలో ప్రభుత్వం విఫలం

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు

**ప్రజాపక్షం/రాయపర్తి:**మక్కలు కొనడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫల అయ్యిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మక్కలు కొనుగోలు చేయాలని కోరుతూ వరంగల్..ఖమ్మం జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో వారం రోజుల నుండి పడిగాపులు కాస్తున్నామని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్ద నిద్ర వీడాలని అన్నారు. రాష్ట్రంలో 11లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండితే, సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదని, ప్రారంభం అయినవి కూడా సరిగా లారీలు లేక బార్దన్ రాక రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. మద్దతు ధర రూ.2400 ఉంటే రూ.1600 నుండి రూ.1800కే అమ్ముకుని రైతులు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్నల కొనుగోలుపై ఈ ప్రభుత్వం ఇంత వరకు నిర్ణయమే తీసుకోలేదని, ఆరుగాలం కష్టపడ్డ రైతులు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్ళి సగం ధరకే జొన్నలు అమ్ముకునే దుస్థితి వచ్చింది. వడ్లు కూడా రోడ్ల మీదనే ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లో ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు బోనస్ ఎగ్గొట్టి ఆ మాటను బోగస్ చేసిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి మక్కలు కొనుగోలు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సత్య శారదకు ఫోన్ చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో మక్కలు పేరుకుపోయాయని అన్నారు. అదనంగా మరో సెంటర్ను ఏర్పాటు చేయాలని కోరారు. మక్కలు నిల్వ ఉండేలా తక్షణమే గోదాంలు ఏర్పాటు చేయాలని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు మునావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, పిఏసిఎస్ మాజీ చైర్మన్ కుందూరు రామచంద్రరెడ్డి, లేతకుల రంగారెడ్డి, గారే నర్సయ్య, అయిత రాంచందర్, ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, బందెల బాలరాజు, గూడెల్లి శ్రీనివాస్, చందు రాము యాదవ్, వెంకన్న, ఉప్పలయ్య, రైతులు,పాల్గొన్నారు.

## హిందూ ధర్మం ప్రపంచానికే ఆదర్శం



**ప్రజాపక్షం/ నర్సంపేట:** హైందవ సంస్కృతి, హిందూ ధర్మం సాంప్రదాయాలు నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని హిందూ ధర్మ సమ్మేళన సమితి నర్సంపేట అధ్యక్షుడు సింగిరికొండ మాధవశంకర్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలో హిందూ ధర్మ సమ్మేళన సమితి గౌరవ అధ్యక్షుడు మోతే సమ్మిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగగా నర్సంపేట నూతన కమిటిని ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సింగిరికొండ మాధవ శంకర్ మాట్లాడుతూ హిందువుగా గర్వించు, హిందువుగా జీవించు అనే నినాదంతో ముందుకు పోతున్నదని తెలిపారు. హిందూ సంప్రదాయాలు, ఆచారాల పట్ల హిందూ ధర్మ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుందన్నారు. హైందవ ధర్మాన్ని పూర్తిస్థాయిలో విశ్లేషణ చేయడం కోసం సమ్మేళన కార్యక్రమాలు తప్పనిసరి అని అన్నారు. మతమార్పిడిలను అరికట్టేందుకు గాను హిందూ సాంప్రదాయాలను కాపాడడానికి ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం పట్ల గడపగడపకు కరపత్రం ప్రచార కార్యక్ర మం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మే నెల నర్సంపేట పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగే హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు దార్ల రమాదేవి, ప్రధాన కార్యదర్శి పోలబోయిన మురళీధర్, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఆర్షనపెల్లి మోహన్ రావు, సైఫా సురేష్, చింతల కమలాకర్ రెడ్డి, కూచన శ్రీనివాసరావు, వేములపల్లి సుబ్బారావు, ద్యాగల శ్రీనివాస్, వాసు నాయక్, కొల్లూరి లక్ష్మీనారాయణ, నిర్వహణ కార్యదర్శి దొడ్డ రవీందర్, కోశాధికారి మేడారపు కమలాకర్, సహకోశాధికారి పాండ్య రమేష్, ప్రచార కార్యదర్శి లు మహాదేవుని జగదీష్, మల్యాల ప్రవీణ్ కుమార్, మల్యాల వినయ్ కుమార్, కృష్ణారావు, గుడిపూడి అరుణ,ముస్కు నీరజ,అపరదపు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒపి 'క్యూ' తగ్గించేందుకు క్యూఆర్ కోడ్ విధానం

**ప్రజాపక్షం/నెక్కొండ:**ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవుట్ పేషెంట్(ఓపి) విభాగంలో క్యూ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఆధారిత నమోదు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా రోగులు ఇంటి నుండే తమ మొబైల్ ఫోన్ ద్వారా ఓపి నమోదు చేసుకొని, ఆసుపత్రికి చేరుకున్న వెంటనే నేరుగా వైద్యులను సంప్రదించవచ్చు. అయితే ఈ సౌకర్యంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది రోగులు ఇప్పటికీ పాత విధంగానే ఆసుపత్రుల వద్దే క్యూల్లో నిలబడుతున్నారు. ఫలితంగా రద్దీ తగ్గాల్సింది పోయి యథాతథంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి, క్యూఆర్ కోడ్ విధానంపై అవగాహన పెంచితేనే ఈ సేవలు సమర్థవంతంగా ఉపయోగపడతాయని అధికారులు సూచిస్తున్నారు.

## మూగజీవాల సేవే మహోన్నతమైనది

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** మూగజీవాలకు వైద్య సేవలు అందించడం నారాయణ సేవకంటే గొప్పదని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా శనివారం హనుమకొండ వడ్డేపల్లి ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని వెళ్లి కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సర్జన్ చందుపట్ల ప్రవీణ్ కుమార్ను కలిసి, పశువుల ఆరోగ్య సంరక్షణలో ఆయన అందిస్తున్న నిరంతర సేవలను అభినందించారు. మూగజీవాల పరిరక్షణలో చూపుతున్న నిబద్ధత, సేవా స్ఫూర్తి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పశువులకు సమయానుకూలంగా వైద్య సేవలు అందించడం తన విధి మాత్రమే కాకుండా బాధ్యతగా భావిస్తున్నానని, తనకు సహకరిస్తున్న జిల్లా అధికారులకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.వైద్యశాలను చికిత్స నిమిత్తం జీవాలను తీసుకొని వచ్చిన పలువురు జంతు యజమానులు కూడా ఆయన సేవలను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎరువుల తయారీదారులు వైఖరికి నిరసనగా డీలర్ల బంద్

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**ఎరువుల తయారీదారుల మొండి వైఖరికి నిరసనగా ఈ నెల 27 న సంపూర్ణ బంద్ పాటిస్తున్నట్లు ఎరువుల డీలర్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర అగ్రి ఇన్పుట్ డీలర్ సంఘం పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కట్కం అశోక్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.తమ క్లిష్టతరమైన సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడమే తమ ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు.ఎరువుల తయారీదారులు ఎరువుల బస్తాలతో పాటు ఉప ఉత్పత్తులను లింకుపెట్టి బలవంతంగా అంటగట్టడం ఆపాలని,ఎరువుల సప్లై ఖర్చులు లేకుండా పంపిణీ చేయాలని కోరారు.డాలర్ల మార్జిన్ 8 శాతం పెంచాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు.వ్యవస్థాపక అధ్యక్షుడు సాని వెంకటేశ్వర్లు,జిల్లా ఉపాధ్యక్షుడు నలిగేటి సతీష్,కాటారం,మహాముత్తారం,మమాదేవపూర్,భూపాలపల్లి,మండలాల అధ్యక్షుడుకవ్వాల చంద్రశేఖర్,గట్టు సమ్మయ్య,కడార్ల వంకర్ ,ముప్పారపు ఎల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తాపడి బాలుడి మృతి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ట్రాక్టర్ బోల్తాపడి బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని గూడూరులో జరిగింది. ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన కాసోజు బ్రహ్మాచారి, ఉపేంద్ర దంపతుల ద్వితీయ కుమారుడు సాయి సంగీత్ (15) ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాశాడు. వేసవి సెలవులు రావడంతో స్నేహితుడు యాదనాల నితిన్తో కలిసి ట్రాక్టర్పై వెళ్లగా నితిన్ నడుపుతుండగా సాయి సంగీత్ పక్కన కూర్చున్నాడు. వ్యవసాయ బావి సమీపంలోని ముర్సుగడ్డ తండా వద్ద ఎదురుగా కారు రావడంతో భయపడ్డ బాలుడు కారును తప్పించే క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్ రోడ్డు కింద కందకంలోకి వెళ్లి బోల్తా పడింది. సాయి సంగీత్ అక్కడికక్కడే మృతిచెందగా, ఆ సమయంలో ట్రాక్టర్ నడుపుతున్న నితిన్ బయటకు దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుని తండ్రి బ్రహ్మాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

# మలేరియా రహిత గ్రామంగా కొడకండ్లను తీర్చిదిద్దుకుందాం

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మలేరియా రహిత గ్రామంగా కొడకండ్లను తీర్చిదిద్దుకుందామని సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మలేరియా అవగాహన గ్రామసభలో వారు మాట్లాడుతూ దోమల నివారణ కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వైద్య అధికారి భారతితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిపికార్యదర్శి ఆంజనేయులు, వార్డు సభ్యులు అందె అరుణ్ కుమార్, వంశీ కృష్ణ, ఏఎన్ఎం సాయిదమ్మ, ఆశలు, పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

**ప్రజాపక్షం/కొడకండ్ల:** ఆరోగ్యమే మహాభాగ్యమని సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాలలో సామూహిక శ్రీమంతాలు, గ్రాడ్యుయేషన్ డే కోసం ఏర్పాటుచేసిన సమావేశానికి సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలన్నారు. మాతా శిశు సంక్షేమం కోసం నిరంతరం ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం సాయిదమ్మ, పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కమలాపూర్:**కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెంలో విషాదం. గ్రామానికి చెందిన సాదుల నరహరి (58) అనే వ్యక్తి వృత్తిలో భాగంగా శుక్రవారం మోత్కులు (విస్తార్లు) సేకరణ కోసం గ్రామ శివారులో వెళ్ళగా వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. నిన్నటి నుండి ఇంట్లోనే ఉంటూ శనివారం మరోసారి అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం తెలపడంతో వారు వచ్చి పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## భార్యను చంపి ... ఉరేసుకున్న భర్త

**ప్రజాపక్షం/సంగారెడ్డి:**జిల్లాలోని సదాశివపేట లోహృదయ విదారక ఘటన చోటుచేసుకుంది . అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త అనంతరం తానే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. సిద్దాపూర్‌కు చెందిన రాజు (40) రాణి( 40) దంపతులు కొంతకాలంగా కుటుంబ కలహాలతో జీవిస్తున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న రాజు శుక్రవారం రాత్రి ఆమెతో గొడవ పడ్డాడు, ఈ క్రమంలో ఆగ్రహంతో రోకలిబండతో రాణి తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తన చర్యలపై భయాందోళనకు గురైన రాజు , అనంతరం సమీపంలోని వ్యవసాయ భూమికి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో కుటుంబం ఒక్కసారిగా ఛిద్రమైంది. తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారడం హృదయ విదారకరంగా మారింది. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మెడికవర్‌లో "రోగర్స్ సిండ్రోమ్"కు విజయవంతమైన చికిత్స

### రెండు నెలల శిశువు ప్రాణాలు కాపాడిన వైద్యులు




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన ఘనత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా వందకు లోపే కేసులు నమోదైన అత్యంత అరుదైన "రోగర్స్ సిండ్రోమ్" వ్యాధిని 2 నెలల శిశువులో గుర్తించి విజయవంతంగా చికిత్స అందించారు.శిశువును మొదట తీవ్ర రక్తహీనత (అనీమియా)తో ఆసుపత్రికి తీసుకువచ్చారు. అనంతరం నిర్వహించిన పరీక్షల్లో రక్తంలో చక్కెర స్థాయిలు 500 ఎంజీ/డీఎల్ కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి వైద్యులు అప్రమత్తమయ్యారు.పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ అక్షిత రావు పర్యవేక్షణలో శిశువుకు తక్షణమే రక్త మార్పిడి చేసి, రక్తంలో చక్కెరను నియంత్రించేందుకు స్లైడింగ్ స్కేల్ విధానంలో ఇన్సులిన్ చికిత్స ప్రారంభించారు.అసలు కారణాన్ని గుర్తించేందుకు సమగ్ర పరీక్షలు నిర్వహించగా, కన్సల్టెంట్ పాథాలజిస్ట్ డాక్టర్ లత మంచాల, డాక్టర్ అక్షిత రావు కలిసి బోన్ మారో ఆస్పిరేషన్ చేశారు. అదనంగా ఆధునిక జన్యు పరీక్ష అయిన హోల్ ఎగ్జామ్ సీక్వెన్సింగ్ ద్వారా ఈ అరుదైన రోగర్స్ సిండ్రోమ్ నిర్ధారణ అయింది.సకాలంలో చికిత్స, విభిన్న వైద్య విభాగాల సమన్వయం, నిరంతర పర్యవేక్షణతో శిశువు ఆరోగ్యం మెరుగుపడి ప్రస్తుతం స్థిరంగా ఉండడంతో డిశ్చార్జ్ చేశారు. తగిన వైద్య సూచనలు, ఫాలోఅప్ ప్లాన్ కూడా అందించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ శిశువుల్లో అరుదైన, ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కోవడంలో ముందస్తు గుర్తింపు, ఆధునిక నిర్ధారణ పద్ధతులు, సమన్వయ వైద్యం అత్యంత కీలకమని తెలిపారు.మెడికవర్ హాస్పిటల్స్ అత్యంత క్లిష్టమైన అరుదైన కేసుల్లో కూడా ఆధునిక, నాణ్యమైన, కరుణతో కూడిన వైద్య సేవలను అందిస్తూ మరోసారి తన ప్రతిభను నిరూపించిందన్నారు.

# ప్రైవేట్ జూనియర్ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి




**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కాలేజీల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హన్మకొండలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి (డిఐఈఓ) కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ హరితకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రతినిధి బృందంగా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బి.నరసింహా రావు మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన గ్రామీణ ప్రాంత విద్యార్థి తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పదవ తరగతి ఫలితాలు వెలువడక ముందే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లను అరికట్టడంలో సంబంధిత ఇంటర్ విద్యాశాఖ అధికారులు ,రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కాలేజీ పేరిట పర్మిషన్ తీసుకొని 4 నుంచి 10 కి పైగా అదనపు బ్రాంచ్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా నెలకొల్పుకుంటూ ప్రభుత్వాన్ని ,విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.ప్రైవేట్ ,కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను అడ్మిషన్ చేయించుకునే ముందు ఎలాంటి అదనపు ఫీజులు తీసుకోమని, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే రెసిడెన్షియల్ హాస్టల్స్ నిర్వహిస్తూ అనేక అబద్ధాలతో కూడిన మోసపూరిత మాయమాటలు చెప్పి తీరా అడ్మిషన్ చేయించుకున్న తర్వాత అడ్మిషన్ ఫీజు ,ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్, పరీక్ష, ప్రాక్టికల్, వెల్కమ్, ఫేర్వెల్ పార్టీ, మెటీరియల్, ఐఐటి జేఈఈ మెయిన్స్, నీట్ కోచింగ్ అంటూ విద్యార్థులను ఫీజుల పేరిట పీల్చి పిప్పి చేస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత ఇంటర్ విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముందస్తు అడ్మిషన్ లు చేపడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పర్మిషన్ లేకుండా అదనపు బ్రాంచ్ లను నిర్వహిస్తున్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ కాలేజీల గుర్తింపుని తక్షణమే రద్దు చేయాలని,అనుమతి లేకుండా అపార్ట్మెంట్లలో కొనసాగుతున్న కాలేజీలను, వాటికి అనుబంధంగా నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ హాస్టల్స్ ను వెంటనే సీజ్ చేయాలని, ప్రైవేట్ కాలేజీల్లో అధిక ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టం రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు వరంగల్‌హన్మకొండ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ వి. కావ్య, కో కన్వీనర్ పి. అనూష, జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, స్వాతి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర భారత వచన కావ్య పర్వాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బండారు రమాదేవి చంద్రమౌళీశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ వరంగల్ ఆధ్వర్యంలో కవిత్రయం చేత విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని డాక్టర్ బండారు ఉమామహేశ్వరరావు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిబద్ధతతో రచించిన ఆంధ్ర భారత వచన కావ్య పర్వాలు ఆది,సభా,విరాట, ఉద్యోగ పర్వాలను శనివారం వరంగల్ లోని ఐఎంఏ భవన్ లో ప్రముఖ పండితులు ప్రవచన కర్త డాక్టర్ మైలవరపు శ్రీనివాస రావు ఆవిష్కరించారు. వనం లక్ష్మీకాంతం రావు సంయోజకత్వంలో సాగిన సభలో విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహిస్తూ డిజిటల్ ప్రపంచంలో వచన భారతం రచన సాహసోపేత చర్య అయినా ప్రస్తుత అవసరాలు అన్నారు. విశిష్ట అతిథి తెలంగాణ హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు భారతంలోని ధర్మం యక్షప్రశ్నల ఆధారంగా వివరించారు.డాక్టర్ దహగాం సాంబమూర్తి ఆదిపర్వాన్ని , డా.కసిరెడ్డి వెంకటరెడ్డి సభా పర్వాన్ని,గిరిజా మనోహర బాబు విరాట పర్వం ,డా.ఎన్.వి.ఎన్.చారి ఉద్యోగ పర్వాన్ని తమదైన శైలులలో సమీక్షించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ మహాభారతం రామాయణం భాగవతం ధర్మానికి నైతిక విలువలకు భూమిలోని, శకుంతల వృత్తాంతం ఎవరి పని వారే చేయాలని తెలుపుతుందన్నారు.కచదేవయాని స్త్రీమూర్తి ప్రేమతత్వాన్ని, ద్రౌపది సహేతుక ప్రశ్నలతో దుశ్శాసన సభను ప్రశ్నించిన ధీరవనితని కొనియాడారు. శ్రీకృష్ణ దుర్యోధనుల మధ్య చర్చ కృష్ణుని రాజనీతి కి నిదర్శనం మంటూ నాలుగు పర్వాల అంతరార్థాన్ని వివరించారు. రచయిత డాక్టర్ ఉమామహేశ్వర రావు తమ స్పందనలో రచనోద్దేశ్యాన్ని తెలిపారు రచయితను ఘనంగా సన్మానించారు.అతిథులకు మెమెంటో లు అందించారు.అనిల్ ప్రసాద్ వుందని సమర్పణ చేసారు.పురప్రముఖులు పండితులు అనేకమంది హాజరయ్యారు.ఎస్.వి.ఎన్. శర్మ,డాక్టర్ ఎల్.ఎస్.ఆర్.కె. ప్రసాద్,పొట్లపల్లి,వాసిరెడ్డి కృష్ణారావు,వి.ఆర్. విద్యార్థి సిహెచ్. శివరావు,వై. నాగయ్య,వాణి ప్రసాద్,అవధానిచేపూరి శ్రీరామ్,కంది శంకరయ్య,జే.ఎన్.శర్మ,మండువ రామగోపాల్ రావు,మండువ రవీందర్ రావు, వెలుగుప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలన



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** శనివారం పోచమ్మ కుంటలో క్షేత్రస్థాయిలో నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని హనుమకొండ డీయమ్ హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య పర్యవేక్షించారు. అంగన్వాడీ,ఇతర కేంద్రములలో నిర్వహిస్తున్న 3 సెషన్స్ లో ఎంత మందికి ఏఏ టీకాలు ఇవ్వవలసి ఉంది,ఎంతమందికి ఇచ్చారు,రాకపోవడానికి కారణాలు పరిశీలించారు. శనివారం 25 డోసులు ఇవ్వటం జరిగిందని,గర్భిణీ స్త్రీలకు, ప్రసవ అనంతర సేవలను ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో అందించాలని ఆయన సూచించారు. గర్భాశయ కాన్సర్ నిరోధక కోసం 14 సంవత్సరములు నిండి 15 వ బర్త్ డే జరుపుకోని అమ్మాయిలకు హెచ్ పీవీ తప్పకుండా ఇప్పించాలని, సెలవులలో పిల్లలు ఇంటి దగ్గర ఉంటారు కాబట్టి ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులకు వాక్సిన్ ఆవశ్యకత తెలియచేయాలని అన్నారు.402 మందికి హెచ్ పీవీ ఇవ్వాల్సి ఉండగా 73 గురికి ఇవ్వడం జరిగిందని నెలలోపు మిగతా వారికి ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీప్తి పాల్గొన్నారు.కాగా అంగన్వాడీ కేంద్రాలు లేని చోట సెషన్స్ నిర్వహణ లో ఎదురవుతున్న ఇబ్బందులను సిబ్బంది డీఎంహెచ్ ఓ దృష్టికి తీసుకు వచ్చారు.

## కాటమయ్య కిట్లు పంపిణీ

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** మండలంలోని తీగారం గ్రామంలో కల్లు గీత కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు బాల్నె వెంకటయ్య గౌడ్, ఆబ్కారీ అధికారులు గీత కార్మికులందరికీ ప్రభుత్వం నుంచి మంజూరైన కాటమయ్య కిట్లను శనివారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గీత కార్మికులు జాగ్రత్తగా, ఓపికతో క్షేమంగా తాటిచెట్లు ఎక్కి జీవనోపాధి కల్పించుకోవాలని అవగాహన తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గద్దం రామచంద్రం, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, స్వామి, హరి, సతీష్, రామ్మూర్తి, యాదగిరి, అజయ్, కృష్ణంరాజు, నాగరాజు, బైరగోని నాగరాజు, శ్రీనివాస్, అనిల్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల విముక్త భారతంపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:**మండల పరిధిలోని మా ఇల్లు ఆశ్రమంలో బాల్య వివాహాల విముక్త భారతం అనే అంశం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ ఎస్ఏ సెక్రటరీ శ్రీదేవి హాజరై మాట్లాడుతూ బాలురకు 21 సంవత్సరాలు, బాలికలకు 18 సంవత్సరాలు పూర్తి అయితేనే ఆ వివాహం చట్టబద్ధమైనదన్నారు. ఈ కార్యక్రమంలో భరోసా లీగల్ అడ్వైజర్ దయామణి, అడ్వకేట్ అనిల్, పీపీ సవ్వరాణి, స్కోప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మనోజ్, మా ఇల్లు ఆశ్రమ వ్యవస్థాపకులు పుప్ప ఇన్నారెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు పూజ, శ్రీధర్ పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరం

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** ఈనెల 25 నుంచి కూనూరు ఉన్నత పాఠశాల విద్యార్థి క్రీడాకారులకు 15 రోజులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు కూనూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆకుల సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన అధ్యక్షులు గాదెపాక అయోధ్య ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ కోశాధికారి కాటం రాజు రెడ్డి సలహా, సూచనల మేరకు సుమారు 30 మంది విద్యార్థులతో బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లుతెలిపారు. వాలీబాల్, సెపక్ టక్రా క్రీడలలో కూడా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహ్మద్ పర్వాజ్, వాలీబాల్ ఇన్‌స్ట్రక్టర్ చందా సాంబరాజు,తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయి అవగాహనతోనే మలేరియా నివారణ

ప్రజాపక్షం/జనగామ :పూర్తి స్థాయి అవగాహనతోనే మలేరియా నివారణ సాధ్యం అవుతుందని జనగామ జిల్లా పరిషత్ సిఈఓ శ్రీరంగరావు, డిఎంహెచ్ఓ కె మల్లికార్జున్‌రావు అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వయించారు. ర్యాలీని డిఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు, మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరంగారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రారంభ దశలోనే గుర్తించడం, పూర్తి స్థాయి చికిత్స తీసుకోవడం ద్వారానే రోగాన్ని నిరోధించవచ్చునన్నారు. ఈ ర్యాలీలో ప్రోగ్రా అధికారి డాక్టర్ అశోక్‌కుమార్, యూపిహెచ్‌సి, బీడీకే వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, కళాబృందాలు పాల్గొన్నారు.

## పద్మ పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాపక్షం/జనగామ:2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందజేసే పద్మ పురస్కారాలకు అర్హులైన వారు ధరఖాస్తు చేసుకోవాలని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు పి చౌడేశ్వరి తెలిపారు. శనివారం వారొక ప్రకటన చేస్తూ ప్రతి ఏడాది జనవరిలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకుల సందర్భంగా చేనేత కళాకారులకు ప్రభుత్వం పద్మ అవార్డులు అందజేస్తుందన్నారు. జనగామ జిల్లాలోనూ ప్రతిభ కనబరిచిన వారు ఈ ఏడాది జులై 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన ధరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకోబడతాయన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఝాన్సిరెడ్డి

ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన బుర్ర వెంకన్న కూతురు వివాహం జరుగగా శనివారం టీపీసీసీఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి, గ్రామ అధ్యక్షుడు నాగయ్య, నాయకులు యాకసోమయ్య, మదార్, వెంకన్న, సందీప్, నాగరాజు, భాస్కర్, ప్రశాంత్, యాకూబ్ కుమార్, సంపత్, భాస్కర్, మహేష్, రమేష్, తదితరులున్నారు.

# విద్యార్థుల ప్లేస్‌మెంట్‌లో అగ్రస్థానంలో ఎస్సార్ యూనివర్సిటీ

ప్రజాపక్షం/హసన్ పర్తి : విద్యార్థులకు ప్లేస్ మెంట్ చూపడంలో ఎస్సార్ యూనివర్సిటీ అగ్రస్థానంలో నిలుస్తుందని యూనివర్సిటీ చాన్సలర్ ఎ. వరదా రెడ్డి అన్నారు.ఎస్సార్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ – 2026 ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాన్సలర్ ఎ. వరదా రెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, డీన్ – ఆపరేషన్స్, గ్రోత్ డాక్టర్ ఆర్. అర్చనా రెడ్డి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్ అసోసియేట్ డైరెక్టర్ జి. సునీల్ రెడ్డి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో చాన్సలర్, వైస్ చాన్సలర్‌తో పాటు రిజిస్ట్రార్, డీన్లు, హెడ్లు, డైరెక్టర్లు, ఫ్యాకల్టీ సభ్యులు, తల్లిదండ్రులు, ప్లేస్ మెంట్ అయిన విద్యార్థులు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సునీల్ రెడ్డి ప్లేస్‌మెంట్ నివేదికను అందిస్తూ, 1300కు పైగా విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. అదనంగా, విద్యార్థులు 1500కు పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు సాధించారని తెలిపారు. అత్యధిక ఇంటర్న్‌షిప్ స్టైపెండ్ నెలకు రూ. 1.1 లక్షలు, అలాగే అత్యధిక ప్యాకేజీ రూ. 44 లక్షల వరకు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రముఖ కంపెనీలలో యాక్సెంచర్ లో 254 మంది, కాగ్నిజెంట్ లో 165 మంది, క్యాప్‌జెమినీలో 57 మంది ఎంపికయ్యారు. అలాగే ఇన్ఫోసిస్ , టీసీఎస్ , డెలాయిట్ , బీఎన్‌పీ పారిబాస్ వంటి ప్రముఖ సంస్థల్లో కూడా విద్యార్థులు అవకాశాలు పొందారని తెలిపారు.అగ్రికల్చర్ రంగంలో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరిచి, సింజెంటా, బేయర్ క్రాప్ సైన్స్, వీఎన్ఆర్ సీడ్స్, అక్షయ కల్పా, ఐటీఎల్ బయోలాజికల్స్, మహికో వంటి సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు పొందారన్నారు.ఈ సందర్భంగా చాన్సలర్ ఎ. వరదా రెడ్డి విద్యార్థులను అభినందిస్తూ, ఈ విజయాలు క్రమశిక్షణ, కృషి మరియు సరైన మార్గదర్శకత్వం ఫలితమని పేర్కొన్నారు.విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ, కొత్త సాంకేతికతలను ఆచరణలో పెట్టి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, విద్యార్థులు సమస్య పరిష్కార నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రొఫెషనల్ విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే గ్లోబల్ స్థాయిలో పోటీపడేందుకు అవసరమైన నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని తెలిపారు.డాక్టర్ ఆర్. అర్చనా రెడ్డి, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్ టీమ్ కృషిని అభినందిస్తూ, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ కెరీర్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# మహిళల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు




ప్రజాపక్షం/భూపాలపల్లి:మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని రాజకీయ దురుద్దేశం కోసమే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు 2026ఏ డి లిమిటేషన్ బిల్లులను వీగిపోయే విధంగా కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, హనుమకొండ రాంనగర్ కార్పొరేటర్ చాడ స్వాతి, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ గండి కొట్టిందని, దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు2026ను కాంగ్రెస్ అడ్డుకోవడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెస్ అడ్డుకున్నది కేవలం ఒక బిల్లును మాత్రమే కాదని, కోట్లాది మంది ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని రాజకీయ భవిష్యత్తును అని ధ్వజమెత్తారు. 2029 సాధారణ ఎన్నికల నాటికే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలనే దృఢ సంకల్పంతో కేంద్రం అడుగులు వేస్తుంటే, రాజకీయ లబ్ధి కోసం, క్రెడిట్ రాకూడదనే అహంకారంతో విపక్షాలు దీనిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. బిల్లుపై కాంగ్రెస్ కూటమి తీరు చూస్తుంటే అది మహిళా వ్యతిరేక కూటమి అని స్పష్టమవుతోందని అన్నారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ మహిళా బిల్లును కేవలం ఎన్నికల హామీలకే పరిమితం చేసిందే తప్ప, చిత్తశుద్ధితో ఎన్నడూ అమలు చేయలేదని, మోదీ, అమిత్ షా ప్రతిపక్షాల ప్రశ్నలకు పార్లమెంటులో స్పష్టమైన సమాధానాలిచ్చినా, మొండి వైఖరితో అడ్డుతగలడం దేశ మహిళలకు చేస్తున్న ద్రోహం అని నాయకులు పేర్కొన్నారు. మహిళలే తగిన బుద్ధి చెబుతారు. చట్టసభల్లో 33 రిజర్వేషన్లు కల్పించే ఈ చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ మరియు వారి మిత్రపక్షాలకు రాబోయే రోజుల్లో మహిళాలోకం తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ కోకన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, పెండ్యాల రాజు, రాష్ట్ర నాయకులు బట్టు రవి, అర్బన్ అధ్యక్షులు గీస సంపత్, 6వ వార్డు కౌన్సిలర్ ఎరుకల రేణుక, మీడియా ఇంచార్జ్ మునెందర్ , బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిబ్, రూరల్ అధ్యక్షులు పులిబిడ్డ రాజు,మహిళా మోర్చా నాయకురాలు బూర పద్మ, నాయకులు పొన్నాల కొమరన్న, శ్రీనివాస్, తాటికంటి రవికుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడిపాల్గొన్నారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరపాలి

### నేర సమీక్ష సమావేశంలో
### ఎస్‌పి సిరిసెట్టి సంకీర్త్



ప్రజాపక్షం/భూపాలపల్లి:ప్రతి కేసులో నాణ్యతతో కూడిన వేగవంతమైన దర్యాప్తు నిర్వహి తులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, మిస్సింగ్ కేసుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నింది తులను కోర్టు ముందు నిలపాలని స్పష్టం చేశారు. జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.విధుల్లో అలసత్వం వహించినట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/కన్నాయిగూడెం :మండలంలోని గుర్రేవుల, లక్ష్మీపురం, దేవాదుల, బుట్టాయిగూడెం, గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే ప్రోగ్రాం జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేస్తున్నామన్నారు. పిల్లల యొక్క మెలురాయి భాష మేధాశక్తి సామాజిక అభివృద్ధి సృజనాత్మకతను పెంపొందించే విధంగా తల్లితండ్రులు కూడా ప్రోత్సహించాలన్నారు. గర్భిణి స్త్రీలు బాలింతలు అంగన్వాడి కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికమైన ఆహారం భోజనం చేయాలన్నారు. గుర్రేవుల గ్రామ సర్పంచ్ అంబాల సౌజన్య మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు రాష్ట్ర ప్రభుత్వం అందించే పౌష్టికమైన ఆహారాన్ని గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు ఉపయోగించుకోవాలన్నారు. సూపర్వైజర్ పుష్పావతి అంగన్వాడీ టీచర్స్ మాధవి, రజిత, రంగమ్మ, సుగుణమ్మ, సూరమ్మ, ఖమరునిష, అనిత, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ వైస్ చైర్మన్ దూడపాక శంకర్

ప్రజాపక్షం/గణపురం:గణపురం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి రాజేశ్వరరావు ను గణపురం మండల కేంద్రానికి చెందిన ఎస్సీ ఎస్టీ వైస్ చైర్మన్ దూడపాక శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరు శ్రీనివాస్, వార్డ్ మెంబర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎదిరలో మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు):ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎదిర గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఆసిఫ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, వైద్య సిబ్బందిచే గ్రామంలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆసిఫ్ మాట్లాడుతూ ప్రజలు తమ చుట్టు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే, ఫ్రై డేను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది కోటిరెడ్డి, ప్రవీణ్, రాజేష్, మోహన్ కృష్ణ, భూపతి రావు, స్వాతి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలవిద్య ద్వారనే బంగారు భవిష్యత్..

ప్రజాపక్షం/నర్సింహులపేట:బాల విద్య ద్వారనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని సర్పంచ్ ఉప్పలయ్య అన్నారు.శనివారం మండలంలోని పడమటిగూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం,విద్య,ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ వారిని ఆరోగ్యకరమైనా పిల్లలుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు.ఈ గ్రాడ్యుయేషన్ డేను తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించారు.కార్యక్రమంలో పెద్దనాగారం సెక్టర్ అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీలత,వార్డు సభ్యులు శ్రీశైలం,టీచర్లు శోభ,యాకలక్ష్మి,హెల్పర్ పుతిలి,ఎల్లేంద్ర,కారోబార్ దేవేందర్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి యువతి మృతి

ప్రజాపక్షం/దేవరుప్పుల: నీటిని తాగడానికి బావి దగ్గరికి వెళ్లిన యువతి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందిన సంఘటన శనివారం మండలంలోని కోల్కొండలో జరిగింది. ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోల్కొండకు చెందిన పస్నీరు రాజుకు మొండ్రాయికి చెందిన వైదేహితో 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. శనివారం ఉదయం ఉపాధి హామీ పనులకు భర్తతో కలిసి వెళ్లిన వైదేహి నీరు తాగడానికి బావి వద్దకు వెళ్లి కాలుజారి బావిలో పడింది. గమనించిన స్థానికులు కొన ఊపిరితో ఉన్న వైదేహిని బయటకు తీసి ట్రాక్టర్లో తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. మృతురాలు తల్లి రేణుక ఫిర్యాదుతో కేసు నమోదుచేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గ్రామాభివృద్ధే దేశ ప్రగతికి సోపానం

కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ములుగు:గ్రామాల అభివృద్ధి ద్వారానే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని, దేశాభివృద్ధిలో గ్రామాల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్క రించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డిఆర్‌డిఏ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధత లభించిందని, 1993 ఏప్రిల్ 24 నుండి ఈ చట్టం అమల్లోకి వచ్చిందని ప్రతి ఏటా ఈ రోజును జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారుల సమన్వయంతో పనిచేసి నిధులను సద్వినియోగించుకొని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, డిఆర్‌డిఓ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రల్లో రైతులకు న్యాయం చేయాలి

ప్రజాపక్షం/గూడూరు; గూడూరు మండల కేంద్రంతోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ దేవేందర్ సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గజ్జి లింగన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్యాయం జరుగకుండా 50 కిలోలకే కాంటాలు వేయాలని 51 కిలోల తీసుకోవడం వల్ల రైతులకు నష్టం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల వద్ద రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.కేంద్రాల్లో మంచినీటి సదుపాయం హమాలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు తగిన నీడ ఏర్పాట్లు చేయాలని వర్షాలు ఈదురు గాలులను దృష్టిలో ఉంచుకుని తార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకోని ఉదయం 10 గంటలకు నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకుడు శ్రీశైలం ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కొటెం అచ్చన్న కొటెం వజ్జయ్య కాదబోయిన నరసయ్య పాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/మంగపేట:ములుగు జిల్లా మంగపేట మండలం పాలయి గూడెం గ్రామంలో జక్కా నర్సింహా రావు తల్లి జక్కా కాంతమ్మ ఇటీవల అనారోగ్యం కారణాల వల్ల మృతి చెందగా గ్రామస్తుల నుండి విషయం తెలుసుకున్న శ్రీ రామ కృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేష్ సేవే మార్గం ప్రజా సేవే నా లక్ష్యం అనే మంచి ఆలోచనతో జక్కా కాంతమ్మ దశదిన కర్మలకు విచ్చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికీ మనోధైర్యం చెప్పి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాలయి గూడెం బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కరకాపల్లి నర్సింహా రావు, బాడిశ నవీన్, మండల సంతోష్, మునిగల మహేష్, తేల సురేష్, కట్ల నాగేంద్రబాబు, పిట్ట చంటి వెంకటేష్, సాధన పెళ్లి వీరయ్య, సందీప్,పిట్ట సురేందర్ రావు, బియ్యం శ్రీను, కాకర్ల స్రవంత్, చిక్కుల మనోజ్, తేల నాగేష్, చెడలగడ్డ సాయి, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేసిన ఎంపి

ప్రజాపక్షం/జనగామ టౌన్: మండలంలోని పెంబర్తి గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్ద గతంలో జెడ్పీటీసీ నిధుల నుంచి షెడ్డు నిర్మాణానికి నిమ్మతి మహేందర్ రెడ్డి నిధులతో చేయడం జరిగింది. ఇంకా మిగిలిన పనుల నిమిత్తం రూ.4.95లక్షలు అవసరం కాగా ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి దృష్టికి కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లగా ఆయన స్పందించి నిధులను మంజూరు చేయడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు గౌలుసుల దుర్గేష్, ఉప సర్పంచ్ రాజు యాదవ్, చిన్న సంపత్,గ్రామశాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ బస్వరాజు మల్లేష్, పాల్గొన్నారు.

## మీ ఇంటి వివరాలు మీరే నమోదు చేసుకోవచ్చు

ప్రజాపక్షం/తొర్రూరు : మీ ఇంటి వివరాలను ఇంటి వద్ద నుంచే మీరే నమోదు చేసుకోవచ్చని తొర్రూరు తహశీల్దార్ నర్సయ్య అన్నారు. భారత జనాభా గణన 2027లో భాగంగా ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు ప్రభుత్వం స్వీయ గణన విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ విధానం ద్వారా ప్రతి కుటుంబం తమ ఇంటి నుంచే కుటుంబ సభ్యుల వివరాలను స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం ఈ నెల 26 నుంచి మే 10 వరకు నిర్వహించబడుతుందన్నారు. ప్రజలకు ప్రతీ రోజు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పదకొండు గంటల వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అధికారిక వెబ్‌సైట్ https://se.census.gov.in ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతీ కుటుంబానికి 15 రోజుల గడువు ఇవ్వడం జరిగిందని ఈ సమయంలోనే తమ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. నమోదు పూర్తయిన తరువాత ప్రతీ కుటుంబానికి ప్రత్యేకమైన ఎస్ఈ ఐడీ కేటాయించబడుతుందని తెలిపారు. ఇది భవిష్యత్తులో వివరాలను పరిశీలించేందుకు, సవరించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. వివరాలను నమోదు చేసే సమయంలో రాష్ట్రం, జిల్లా, గ్రామం, పట్టణం, పిన్ కోడ్ వంటి వివరాలను సరైన విధంగా నమోదు చేయాలన్నారు. అదే విధంగా డిజిటల్ మ్యాప్‌లో తమ నివాస గృహాన్ని తప్పనిసరిగా గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా గృహ స్థానం ఖచ్చితంగా నమోదు కావడం వల్ల గణనలో ఖచితత్వం పెరుగుతుందని, భవిష్యత్‌లో సర్వేలకు ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్వీయ గణన ద్వారా గణన ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. వివరాలు నమోదు చేయలేని వారు, సాంకేతిక సహాయం అవసరమైన వారు గణన కర్తల సహాయాన్ని పొందవచ్చన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వివరాలను సమయానికి ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అధికారక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసి దేశ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## జామా మసీదును తనిఖీ చేసిన అధికారులు

ప్రజాపక్షం/తొర్రూరు: పట్టణ కేంద్రంలోని జామా మసీదును రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ నజీముద్దీన్, తహశీల్దార్ నర్సయ్య, మున్సిపల్ మేనేజర్ కట్టస్వామి, ఎండి.సలీంలు తనిఖీ చేశారు. మసీదుకు సంబంధించిన రూములను తనిఖీ చేసి షాపు యజమానుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అడిషనల్ రెవెన్యూ కలెక్టర్ ఆదేశాల మేరకు మసీదును తనిఖీ చేసి మసీద్ అగ్రిమెంట్ ప్రకారం షాపుల లీజు వివరాలను సేకరించామని, సర్వే చేసిన వివరాలను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.



అనంతరం మసీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.అలీమ్, అమీర్‌లు మాట్లాడుతూ మసీదు కమిటీ అగ్రిమెంట్ ప్రకారం 15 సంవత్సరాల కాలం పూర్తి అయినా షాపులను ఖాళీ చేయాలని కమిటీ తరుపున నోటీసులు పంపించామని, కమిటీకి సహకరించకుండా వ్యవహరిస్తున్నారని ఇదే విషయాన్ని జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధికారులకు తెలియజేయడంతో సంబంధిత అధికారులు మసీదుకు వచ్చి తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ రవీందర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు

ప్రజాపక్షం/తొర్రూరు: ప్రజల అవసరాల కోసం వినియోగించే వస్తువుల ఎగుమతి, దిగుమతి చేస్తూ జీవిస్తున్న హమాలీ వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తెలంగాణ ప్రగతిశీల హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని వెలికట్ట గ్రామంలో సమావేశాన్ని నిర్వహించారు. టీయూసీఐ బంధు యాకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి కొత్తపల్లి రవి పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 11కోట్ల మంది హమాలీలు ఎగుమతులు, దిగుమతులు చేస్తూ ఎన్నో ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. అలాంటి హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా ఏర్పాటు చేయాలని, దాని కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన హమాలీలకు రూ.ఐదు వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. అర్హులైన హమాలీలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. టీయూసీఐ తొర్రూరు ఏరియా కమిటీ అధ్యక్షుడు ఎండి.షరీఫ్ మాట్లాడుతూ 140వ మేడేను కార్మిక వర్గం ఘనంగా నిర్వహించుకొని కార్మిక హక్కులను కాపాడుకోవాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొత్తపల్లి రవి, అధ్యక్షులుగా బంధు సోమయ్య, ఉపాధ్యక్షుడు జాటోతు కిషన్, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి యాకయ్య, సహాయ కార్యదర్శిగా జాటోతు లచ్చిరాం, కోశాధికారిగా పింగిలి వెంకన్నతో పాటు కార్యవర్గ సభ్యులుగా తొమ్మిది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలి



ప్రజాపక్షం/తొర్రూరు: విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని మహబూబాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు గ్రీష్మోల్లాసం కార్యక్రమాన్ని శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అన్నారం రోడ్డులోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో నెల రోజుల పాటు నిర్వహించే సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో సమ్మర్ క్యాంపును నిర్వహించడం జరుగుతుందని ఈ క్యాంపుకు వివిధ జిల్లాల నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. వారికి సంబంధించి వసతి, పౌష్టికాహారాన్ని నెల రోజుల పాటు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ శిబిరంలో క్రీడలు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, డిజిటల్ లెటరసీ వంటి అనేక కార్యక్రమాలను నిపుణులైన ఉపాధ్యాయుల బోధనలతో నిర్వహించడం జరు గుతుందని తెలిపారు. అనంతరం తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తును మరింత మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి, డీఎల్‌పీఓ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్, హాస్టల్ వార్డెన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాపక్షం/తొర్రూరు : ప్రజలు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధీరజ్ కుమార్ అన్నారు. మండలంలోని భోజ్యాతండాలో శనివారం న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు, రహదారి భద్రత, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, ఎన్‌డీపీఎస్ యాక్ట్, సైబర్ క్రైమ్ యాక్ట్‌పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో జడ్జి ధీరజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రాణ రక్షణ కోసం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం పోలీసుల కోసం కాదని అన్నారు. మీ ప్రాణాల రక్షణ కోసమని చెప్పారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ ప్రతీ పౌరుడు ప్రాథమిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిదాలకు దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవనం సాగించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి ప్రాణాంతకమని, ట్రాఫిక్ నియమాలను ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం కుటుంబాన్ని రోడ్డున పడేస్తుందని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో తలకు తగిలే గాయాల నుండి ప్రాణపాయం తప్పుతుందన్నారు. ఆడపిల్లలకు 18సంవత్సరాలు పూర్తి అయిన తరువాత వివాహాలు చేయాలని సూచించారు. యువత గంజాయి జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వెంకటరత్నం, అడ్వకేట్స్ జి.రామకృష్ణ, ఎం.నాగరాజు, ఎం.అశోక్, ఎం.సంతోశ్, టి.గోస్, రమేశ్, సర్పంచ్ మాలోతు మౌనిక సంతోశ్, ఎస్ఐ శివరామ కృష్ణ, కోర్టు సిబ్బంది, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు సమీపంలో రోడ్డు ప్రమాదం

ప్రజాపక్షం/గూడూరు; గూడూరు మండలంలోని కోల్లాపురం గ్రామానికి చెందిన మేస్త్రి చలమల్ల వెంకటేశ్వర్లు 40 రోడ్డు ప్రమాదంలో తీవ్రవంగా గాయపడిన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చుసుకుంది వివరాలు ప్రకారం వెంకటేశ్వర్లు తన ద్విచక్ర వాహనం ఎస్ 07 హెచ్‌వి 7280 పై గూడూరు నుండి ఇంటికి తిరిగి వెళ్తుండగా మధ్యాహ్నం సుమారు సమయంలో గూడూరు సబ్ స్టేషన్ సమీపంలో వెనుక నుండి వచ్చిన ఎరుపు రంగు మారుతి మెలినో కారు టిఎస్ 03 ఈఎక్స్ 0227 అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడంతో ఢీకొట్టింది ఈప్రమాదంలో వెంకటేశ్వర్లు కిందపడిపోయి తలకు తీవ్రగాయాలు అయ్యాయి వెంటనే స్పందించిన స్థానికులు ఆయనను గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మహబూబాబాద్‌లోని హాస్పిటల్ కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును నడిపిన వ్యక్తి హన్ముకొండకు చెందిన భూక్య కిషన్ గుర్తించారు. ఘటనపై బాధితుడి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు,

## జనగణనపై షార్ట్ ఫిలిం చిత్రీకరణ

ప్రజాపక్షం/పాపన్నపేట:త్వరలో జరగబోయే జనగణన పై ప్రజలకు అవగాహన కల్పించాల న్న ఉద్దేశంతో మండల కేంద్రమైన పాపన్నపేట లో షార్ట్ ఫిలిం చిత్రీకరించారు. ఈ కార్యక్రమా నికి పాపన్నపేట తెలుగు ఉపాధ్యాయులు అ ంజాగౌడ్ దర్శకత్వం వహించగా వివిధ ఉపా ధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చిత్రీకరించారు. ముఖ్యంగా జనగణన లో తమ వివరాలు అ ం దిస్తే, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథ కాల నుండి తమ పేర్లు ఎక్కడ తొలగిస్తారో అ న్న అపోహ నుండి ప్రజలను దూరం చేయాల న్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించా రు, కెమెరామెన్ గా పుర్ర శ్రీకాంత్ ,ఎడిటర్ గా సంకీర్తన్ వ్యవహరించారు. అంతేకాకుండా జన గణన పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి, జ న గణన కోసం తమ ఇండ్లకు వచ్చి ఎన్యూమరే టర్లకు సహకరించాల్సిందిగా వారు సూచించా రు. ఫీల్డ్ ట్రైనర్లు శ్రీనివాస్ రెడ్డి, రమణ, భట్టు నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలరాజు, పంతుల రాజు, భూషణం, కేవిఆర్ నాయుడు, దుర్గా ప్రసాద్, బాల మల్లేష్, ఎల్లం, మంగ నర్సింలు, వీరేశం, సాయి సిరి, దత్తు రె డ్డి, వేణు, సంతోష్, మోహన్ రావు, సుమలత, శ్రావణి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు సమరోత్సాహంతో పని చేయాలి

ప్రజాపక్షం/పటాన్‌చెరు : రానున్న స్థానిక స ంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం జిల్లాలోని అన్నిజడ్పీటీసీ ,ఎంపిటీసీ స్థానాల్లో జ యకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కా ర్యకర్త పనిచేయాలని మెదక్ పార్లమెంట్ కా ంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నీలం మదు ముదిరాజ్ పి లుపు నిచ్చారు. శనివారం సిద్దిపేట పట్టణంలో ని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ని యోజకవర్గ ఇంచార్జీ పూజల హరికృష్ణ ఆధ్వర్య లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్య కర్తల సమావేశంలో ఆయన పాల్గొని ఎన్నికల వ్యూహంపై దిశ నిర్దేశం చేసారు. ఈ సందర్భ ంగా నీలం మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షే పథకాలు, ఆరు గ్యారంటీల అమలు తీరును క్షేత్రస్థాయిలో బ లంగా తీసుకెళ్లాలని సూచించారు. ఋణమాఫీ , మొదలు కొని మహిళలకు ఉచిత బస్సు ప్ర యాణం,గృహజ్యోతి వంటి పథకాలు ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచాయని ఇదే ఉత్సాహ ంతో ఎన్నికల బరిలోకి దిగాలని ఆయన స్పష్టం చేశారు

## అప్పుల బాధతో ఉరి వేసుకొని మృతి

ప్రజాపక్షం/కౌడిపల్లి :అప్పుల బాధతో రైతు ఆ త్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా కౌ డిపల్లి అడవి ప్రాంతంలో బట్టెమ్మ గుడి సమీప ంలో చోటు చేసుకుంది కొల్చారం మండలం వ రిగుంతం గ్రామ నికి చెందిన షేక్ గారి నరేంద ర్ గౌడ్ 52 తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశారు ఇందుకోసం కెనరా బ్యాంక్ నుంచి 5 ల క్షల రూపాయలు రుణం తీసుకున్నారు. అ యితే ఎండాకాలం కావడంతో సాగునీరు అ ందక వరి పంట నాలుగు ఎకరాలు ఎండిపోవ డంతో పెద్ద మొత్తంలో ఆర్థిక ఇబ్బందులు పడి అప్పు తీర్చలేక మనోవేదన గురై శనివారం రో జు చెట్టుకు ఉరేసుకొని మృతి చెందారు. మృ తుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకే ఎస్సై అ మర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి కూలీ ముఖానికి పౌడర్ క్షణాల్లో ముఖం స్కానింగ్

ప్రజాపక్షం/అల్లాదుర్గం:ఉపాధి హామీ పథకంలో అక్ర మాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల ముఖ గుర్తింపు స్కానింగ్ విధానంలో హాజరు నమో దును తప్పనిసరిగా చేసింది. అల్లాదుర్గం మండలం ముప్పారంగ్రామంలో ముప్పదేవుని చెరువు కింద ఆయక ట్టుకు పారె నీటి కాలువ పనులు చేపడుతున్న ఉపాధి కూలీలు ముందుగా రెండు వారాలు చేసిన పని సాంకే తిక ఇబ్బందులతో ముఖ గుర్తింపు సమస్యలు ఎదుర య్యాయి. ఈ సమస్యలను అధిగమించడానికి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వినూత్నంగా ఆలోచించి పని ప్రదేశంలో రెండు కర్రలకు తెల్లటి పరదా అమర్చి, ఎదురుగా గొడుగు నీడలో ట్రైపాడ్ సిస్టంతో ఉపాధి కూలీల ముఖం స్కానింగ్ కనురెప్పలు మూసి, తెరుస్తూ, ఉండగా క్షణాల్లో ముఖం స్కానింగ్ చేస్తూ హాజరు నమోదు చేశారు. కొందరి కూలీలకు హాజరు నమోదు కాకపోవ డంతో ముఖానికి తెల్లటి పౌడర్ వేసుకొని ముఖం స్కానింగ్ చేసుకోవడంతో సులభంగా ఆన్లైన్లో అప్లోడ్ అవుతూ హాజరు నమోదు చేసుకుంటున్నారు.

**ముఖానికి పౌడర్ వేసుకున్న ఉపాధి కూలీ**

ఉపాధి హామీ పనుల్లో హాజరు నమోదుకు ముఖం స్కానింగ్ చేసే క్రమంలో హాజరు నమోదు కాకపోవ డంతో ముప్పారం తాండకు చెందిన ఉపాధి కూలీ రాఘ వులు పౌడర్ అద్దుకొని క్షణాల్లో ఆన్లైన్లో అప్లోడ్ అయ్యి హాజరు నమోదు చేసుకున్నారు. ఉపాధి హామీ పనులకు రోజుకు 130 నుండి 150 మంది కూలీలు హాజరవుతు న్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. ఉపాధి కూలీల ఒక్కొ క్కరు మీటర్ వెడల్పు, మూడు మీటర్ల పొడవు 0.5 మీటర్ల లోతు తో పనులు చేపడితే ఒక్కొక్క కూలీలకు 307 రూపాయల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వినూత్న ఆలోచనతో చేపట్టిన ట్రైపాడ్ విధానంలో క్షణాల్లో ముఖం స్కానింగ్ జరుగుతుందని గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మంగమ్మ తెలిపారు.

## రైతులు దళారులను ఆశ్రయించవద్దు

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/శివ్వంపేట : రైతులు దళారులను ఆశ్రయిం చుండా కొనుగోలు కేంద్రాలలోనే పండించిన వరిధా న్యాన్ని విక్రయించుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీ తాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెన్నా పూర్, శివ్వంపేట, లింగోజీగూడ, కొత్తపేట గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చేతులమీ దుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ



చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, సర్పంచ్‌లు కొమురయ్య, వెంకటేశ్వర్, బాసం పల్లి అమృత, లింగనబోయిన రాములు, బీఆర్ఎస్ నాయకులు, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించండి

### ఎమ్మెల్యే రోహిత్ రావు

ప్రజాపక్షం/పాపన్నపేట:ధాన్యం విక్రయాల లో అపో హలు నమ్మవద్దని రైతులు పండించిన పంట చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ కొను గోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రమైనపాపన్న పేట,కొత్తపల్లికుర్తివాడ, నాగసాన్ పల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం విక్రయ కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల న్నారు. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తా మని చెప్పారు. ప్రతి రైతు ధైర్యంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డారని ఆరో పించారు. ఇది ప్రజల ప్రభుత్వమనిపేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం కొంపల్లి లోనిర్వహిస్తున్న గ్రామ



దేవతల విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా రైతు నాయకుడు ప్రభాకర్ రెడ్డి, సర్పంచులు పావని నరేందర్ గౌడ్, శ్రీధర్, పాపయ్య, నాయకులు మల్లప్ప, శ్రీనివాస్, మురళి, కిష్టయ్య, సంగమేష్, గౌస్, సతీష్, రాజశేఖర్ తో పాటు వివిధ గ్రామాల కార్యకర్తలు రైతులు తదితరులు ఉన్నారు.

## టిఆర్ఎస్ సభకు భారీగా తరలిన గజ్వేల్ జనం

ప్రజాపక్షం / గజ్వేల్:కల్వకుంట్ల కవిత నేతృత్వంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర సేన సభకు గజ్వేల్ మున్సిపల్ తో పాటు నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల నుండి జనం భారీగా తరలివెళ్లారు. హైకోర్టు న్యాయ వాది, జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి గత వారం రోజులుగా జన సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించి మండలాల వారిగా పలువురు నేతలకు బాధ్య తలు అప్పగించారు. దీంతో శనివారం హైదరాబాదులో జరిగిన కవిత పార్టీ ప్రకటన కార్యక్రమానికి వందలాది వాహనాల్లో జనం తరలి వెళ్లడం కనిపించింది. ఉద్యమ కారులు, అమర వీరుల కుటుంబాలు, గత పదేళ్ల కేసీఆర్ పాలనపై గుర్రుగా ఉన్న పలువురు నేతలు కల్వకుంట్ల కవిత సభకు సంపూర్ణ సహకారం అందించారు. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీలపై విసుగు చెందిన నేతలు, రైతులు, యువత, మహిళలు, కార్మికులు, విద్యా ర్థులు తరలి వెళ్లగా, మల్లన్న సాగర్ ముంపు గ్రామాల



ప్రజల నుండి భారీ స్పందన కనిపించింది. అయితే కవిత ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ప్రకటన అన్ని వర్గాలను ఆలోచింపజేయగా, గజ్వేల్ మున్సిపల్ తో పాటు రూరల్ మండలం, కొండపాక, జగదేవ్ పూర్, మర్కుక్, వర్గల్, ములుగు, మనోహరాబాద్, తూప్రాన్, రాయపోల్ మండలాల నుండి జనం తరగతి వెళ్లడం కని పించింది. కాగా ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన వార్డు మెంబర్ ప్రశాంత్

ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట గ్రామానికి చెందిన టంకరి ప్రశాంత్ గత సర్పంచ్ ఎన్నికల్లో మొదటి వార్డు మెంబర్ గా ఇండి పెండెంట్ గా పోటీ చేసి గెలుపొందారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజ లకు మొదటి వార్డు అభివృద్ధికి ఎలాంటి నిదులు రాకపోవడంతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరడమే ముఖ్యమని భావించి శనివారం నిజాంపేట మండల కేంద్రానికి పలు అభివృద్ధి కార్యక్ర మాల ప్రారంభోత్సవాలకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకట గౌడ్, పట్టణ అధ్యక్షులు కొమ్మాట బాబు, అమరసేన రెడ్డి, నసిరుద్దీన్, వై వెంకటేశం, కొమ్మాట సుధాకర్, సామల మహేష్, పంజా బాబు తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు లేకుండా జనగణన పూర్తి చేయాలి

ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట : జనగణన డేటా సేకరించేటప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాస్టర్ ట్రై నర్ అశోక్ రెడ్డి, తహసిల్దార్ ప్రభుదాస్, ఎంఈఓ శేఖర్ లు సూచిం చారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అధికారులు ఏ ర్పాటు చేసిన జనగణన సెన్సెస్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగి సింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 12 మంది సూప ర్వైజర్లు , 80 మంది ఏ న్యుమరైటర్లు ఉండగా గత ఆరు రోజులుగా రెండు బ్యాచులుగా ఏర్పాటు చేసి ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లకు గై డ్ లైన్స్ పై అవగాహన కల్పించామని తెలిపారుఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## వాగ్దేవి కళాశాలలో వర్క్ షాప్

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:వరంగల్‌లోని వాగ్దేవి కళాశాల ఆధ్వ ర్యంలో వైద్య, ఫార్మసీ, ఫిజియోథెరఫీ, ఇంజనీరింగ్, అనుబంధ శా స్త్రాల సామర్థ్య నిర్మాణ వర్క్‌షాప్ రెండు రోజుల పాటు ఏప్రిల్ 24 ...25 తేదీలలో అధ్యాపకులకు రాంనగర్ ప్రాంగణంలోని ఆడిటోరి యంలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కి రిసోర్స్‌పర్సన్‌గా డాక్టర్ శ్రీ రామ్, ప్రొఫెసర్ అండ్ డీన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, దయాన ంద్ వర్క్‌షాప్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం వివరించారు. రెండు రోజులు నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో జీవ వైద్య రంగాలలో పరిశోధనలు చే యాలని మానవాళికి ఉపయోగమయ్యే విధంగా డాక్టర్స్‌తోని కలిసి అధ్యాపకులు పనిచేస్తే చాలా గవర్నమెంట్ ప్రాజెక్ట్స్, భవిష్యత్తులో ఇలాంటి వర్క్‌షాప్‌లు మరిన్ని జరగాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌కి వ రంగల్ వైద్యులు డాక్టర్ సత్య కిరణ్ ఎండి, వాగ్దేవి కళాశాల ఫా ర్మసీ, ఫిజియోథెరఫీ, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలోని ఎంపిక చే యబడిన అధ్యాపకులు పాల్గొన్నారు. వాగ్దేవి కళాశాలల యాజమా న్యం అధ్యాపకులలోని పరిశోధన నైపుణ్యాలను మెరుగుపరిచి స మాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలనే ముఖ్య ఉద్దేశ్య ంతో ఈ వర్క్‌షాప్‌ని నిర్వహించినట్లు డైరెక్టర్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ డాక్టర్ కాలం శిరీష, వాగ్దేవి సంయుక్త కళాశాలల ప్రిన్సిపా ల్స్, కోఆర్డినేటర్ డాక్టర్ టి శ్రీకాంత్ తెలిపారు.

## మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మాసాని వెంకటరాములు మృతి దేహానికి నివాళి

ప్రజాపక్షం/సంగారెడ్డి :రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కా నిస్టేబుల్ మాసాని వెంకటరాములు అంత్యక్రియలకు నారాయణ ఖేడ్ పట్టణంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరై వెంకటరాము లు మృతి దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంత రం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల ని మిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లా డుతూ జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వెంకట రాములుకు రావలసిన అన్ని రకాల ప్రయోజనాలకు (బెనిఫిట్స్) స కాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భ ంగా ఎస్పీ మాట్లాడుతూ జహీరాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో వి ధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మాసాని వెంకటరాములు తే ది 24042026 నారాయణ ఖేడ్ నుండి జహీరాబాద్ రూరల్ పో లీసు స్టేషన్ కు బైక్‌పై వెళ్తుండగా ఉదయం సుమారు 10.30 గ ంటల సమయంలో న్యాల్కల్ మండలం చాల్కి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట జహీరాబాద్ డిఎస్పీ సైదా నాయక్ ,జహీరాబాద్ డిఎస్పీ సైదా నాయక్ ,జహీరాబాద్ టౌ న్ ఇన్స్పెక్టర్ శివలింగం, జహీరా బాద్ రూరల్ ఎస్ఐ కాశీనాథ్, నా రాయణఖేడ్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టోపీల పంపిణీ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ నగరంలోని పిన్నవారి వీధిలో శ్రీ వాసవి మాత పుట్టిన రోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ఎండలో నిత్యం తిరుగుతూ పనిచేస్తుంటారు కాబట్టి వారికి వాసవి మాత దీవెనలు ఉండాలని, అలాగే వారికి ఆదివారం రోజున సెలవు కాబట్టి ఈ రోజునే వాసవి మాత జయంతి సందర్భంగా వారందరికీ టోపీలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చి అందరూ చల్లగా ఉండాలని వాసవి మాతను వేడుకుంటూ 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 6గంటలకు స్టేషన్ రోడ్డు పోచమ్మగుడి నుండి వరంగల్ చౌరస్తా, జెపిఎన్ రోడ్డు దుర్గేశ్వర స్వామి గుడి, పిన్నవారి వీధి, అలాగే బట్టల బజార్, వాసవి మాత టెంపుల్, రామలింగేశ్వర స్వామి గుడి నుండి అమ్మవారి రథయాత్ర ప్రారంభమై వాసవి మాత టెంపుల్ వరకు నిర్వహిస్తామని కావున వైశ్యులు, వైశ్య సహోదరులు, సోదరీమణులు, అలాగే వైశ్య శ్రేయోభిలాషులు అందరూ కూడా ఈ రథయాత్రలో పాల్గొని వాసవి మాత కృపా కటాక్షాలు ఉండాలని కోరుకున్నారు.

## స్వీయ గణనకు ప్రజలందరు ముందుకు రావాలి

**ప్రజాపక్షం/నెక్కొండ:** భారత జనాభా గణన ...2027లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానాన్ని ప్రజలంతా వినియోగించుకొని విజయవంతం చేయాలని నెక్కొండ తహసీల్దారు వేముల రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆధునిక సాంకేతికతో ప్రజలకు సౌలభ్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుండి మే 10, 2026 వరకు స్వీయ గణన ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతి రోజు ఉదయం 6గంటల నుండి రాత్రి 11గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రతి కుటుంబానికి 15 రోజుల గడువు ఉంటుందని, ఈ సమయంలోనే వివరాలు నమోదు చేయాలని సూచించారు. నమోదు పూర్తయ్యాక ప్రతి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని, భవిష్యత్తులో వివరాల సవరణకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. సాంకేతిక ఇబ్బందులు ఎదురైన వారు గణనకర్తల సహాయం పొందవచ్చని, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులు సహా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దేశ అభివృద్ధికి తోడ్పడాలని తహసీల్దార్ వేముల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ యాసం లావణ్య, దయాకర్, ఈజీఎస్ ఏపిఓ జాకబ్, మండల వ్యవసాయాధికారి నాగరాజు, పాల్గొన్నారు.

## "శ్రీ వందన"లో హైరిస్క్ డెలివరీ....

తల్లిబిడ్డలు క్షేమం...వైద్యురాలికి కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** సిద్దిపేట పట్టణ కేంద్రంలోని శ్రీ వందన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం గుండె సమస్య ఉన్న నిండు గర్భిణికి ప్రసవం చేసినట్లు ఆసుపత్రి వైద్యురాలు బొజ్జ వందన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యతో ఉన్న నిండు గర్భిణి ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిందని,రిపోర్టులు పరిశీలించగా హైరిస్క్ ఉన్నట్లు గుర్తించామన్నారు. హైరిస్క్ ప్రసవాన్ని నిర్వహించి తల్లిబిడ్డలను క్షేమంగా అందించిన వైద్యురాలు వందన,ఆసుపత్రి సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తక్కువ ఖర్చుతో హైరిస్క్ ప్రసవాలు చేస్తున్నామని,ఈ నెలలోనే నాలుగు సాధారణ ప్రసవాలు నిర్వహించామని,హెచ్ఐవి,హిస్టోరక్టమి,విడిఆర్ఎల్ కలిగిన ప్రసవాలు తక్కువ ఖర్చులో చేస్తున్నామని సిద్దిపేట పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

మంత్రి వివేక్ వెంకటస్వామి

64 కోట్ల 77 లక్షల రూపాయల వ్యయంతో 597 కళ్యాణ లక్ష్మి, 50 షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/నర్సాపూర్:**మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రివర్యులు, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్ వెల్దుర్తి రోడ్ లో ఉన్న సాయి కృష్ణ కళ్యాణ మండపంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డిల తో కలిసి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపిల్లల పాలిట వరం అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి, సిడిపిఓ హేమ భార్గవి, తహసిల్దార్ శ్రీనివాస్, కమలాద్రి, మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి. టీఆర్ఎస్ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రం గౌడ్, మన్సూర్, హరికృష్ణ పాల్గొన్నారు.

## కలిసికట్టుగా పనిచేస్తే మలేరియా నివారించవచ్చు



**ప్రజాపక్షం/ములుగు:**కలిసి కట్టుగా పనిచేస్తేనే మలేరియాను నివారించవచ్చునని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు ప్రారంభించి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2030 సంవత్సరాల నాటికి మలేరియా నిర్మూలనలో వైద్య ఆరోగ్య, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాలు కలిసికట్టుగా పనిచేసినప్పుడే మలేరియా వ్యాధిని అంతం చేయవచ్చునని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఈ సంవత్సరం పటిష్టమైన ప్రణాళికలు తయారు చేసుకొని అమలు పరిచి మలేరియా వ్యాధి వ్యాప్తిని అరికడదామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, పర్యవేక్షకులు, మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య కార్యకర్తలతో ముందస్తుగా సమావేశాలను ఏర్పరచుకొని మలేరియా వ్యాధి వ్యాప్తి నివారణకు ముందస్తు చర్యల గురించి వివరించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నామన్నారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలతో గ్రామాలలో ఇంటింటి ధరించడం లాంటి విషయాలపై ప్రజలలో అవగాహనను పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగ గణేష్, మాస్ మీడియా అధికారి సంపత్, అసిస్టెంట్ మలేరియా అధికారి దుర్గారావు, సురేష్ బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ సాంబయ్య, సూపర్‌వైజర్స్ కమల, దేవమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొంపల్లిలో వైభవంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం



**ప్రజాపక్షం/పాపన్నపేట:**మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి, పాల్గొని గ్రామదేవతలు శ్రీ దుర్గాదేవి, పెద్దమ్మ తల్లి, గంగమ్మ దేవి, భూలక్ష్మి దేవి, నవగ్రహ, పోచమ్మ దేవి, నల్లపోచమ్మ దేవి, కాళికా దేవి, ఎల్లమ్మదేవి, లింగామయ్య కాటమయ్య దేవతల విగ్రహాల త్రయాహీనక యాగ ప్రతిష్టాపన పూజలు, హోమంలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామాలు సుభిక్షంగా, శాంతి సమృద్ధులతో ఉండాలని ఆకాంక్షించారు. మన సంప్రదాయాలు, ఆచారాలు గ్రామీణ సంస్కృతికి ప్రతీకలని, గ్రామదేవతల పూజలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కొంపల్లి గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జుకంటి పాపయ్య ఉప సర్పంచ్ పెంటయ్య, మండల మాజీ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, సోములు, వెంకటేశం, అంథోని బిద్రి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## రేగోడ్ శ్రీబ్రహ్మంగారి మఠంలో మంత్రి పూజలు



**ప్రజాపక్షం/రేగోడు :**మెదక్ జిల్లా రేగోడు తెలంగణ రాష్ట్రంతోనే ఏకైక సమాధి బ్రహ్మంగారి మఠంలో జాతర ఉత్సవాల్లో భాగంగా ఆరాధన ఉత్సవాల్లో శనివారం మంత్రి దామోదర్ రాజనర్సింహా పాల్గొని పట్టు వస్త్రాలను సమర్పించారు మంత్రిని ఆలయ కమిటి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు ప్రత్యేక పూజలు నిర్వహించారు అర్హులైన పేదలందరికీ విడుదల వారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు సోమవారం రేగోడ్ మహేష్ నిర్మించిన ఇందిరమ్మ ప్రారంభించిరు ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర రెడ్డి మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తాసిల్దార్ దత్తారెడ్డిసిఐ రేణుక ఎస్సై పోచయ్య సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చల్మేడ గ్రామంలో రామాయంపేట సొసైటీ కొనుగోలు కేంద్రాన్ని అలాగే నిజాంపేట వ్యవసాయ మార్కెట్ లో కొనుగోలు కేంద్రాన్ని, కల్యాకుంట గ్రామంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం 33 కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో రెండు కోట్ల వ్యయంతో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, ఉచిత ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత కరెంటు, ఇలాంటి అనేక అభివృద్ధి పథకాలతో తెలంగాణ ముందంజలో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజిరెడ్డి, ఏఓ సోమలింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మాట బాబు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, అమర్ సేనారెడ్డి, ముత్యంరెడ్డి, పంజా మహేందర్, నసీరుద్దీన్, శ్యామల మహేష్, చింతల స్వామి, రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగణనపై షార్ట్ ఫిలిం చిత్రీకరణ

**ప్రజాపక్షం/పాపన్నపేట:**త్వరలో జరగబోయే జనగణన పై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో మండల కేంద్రమైన పాపన్నపేటలో షార్ట్ ఫిలిం చిత్రీకరించారు. ఈ కార్యక్రమానికి పాపన్నపేట తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్ దర్శకత్వం వహించగా వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చిత్రీకరించారు. ముఖ్యంగా జనగణన లో తమ వివరాలు అందిస్తే, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాల నుండి తమ పేర్లు ఎక్కడ తొలగిస్తారో అన్న అపోహ నుండి ప్రజలను దూరం చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించారు, కెమెరామెన్ గా పుర్ర శ్రీకాంత్ ,ఎడిటర్ గా సంకీర్తన్ వ్యవహరించారు. అంతేకాకుండా జనగణన పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి, జన గణన కోసం తమ ఇండ్లకు వచ్చి ఎన్యూమరేటర్లకు సహకరించాల్సిందిగా వారు సూచించారు. ఫీల్డ్ ట్రైనర్లు శ్రీనివాస్ రెడ్డి, రమణ, భట్టు నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలరాజు, పంతులు రాజు, భూషణం, కేవీఆర్ నాయుడు, దుర్గా ప్రసాద్, బాల మల్లేష్, ఎల్లం, మంగ నర్సింలు, వీరేశం, సాయి సిరి, దత్తు రెడ్డి, వేణు, సంతోష్, మోహన్ రావు, సుమలత, శ్రావణి, కరుణ పాల్గొన్నారు.

## డిజిటల్ విద్యలో తెలంగాణకు కొత్త మైలురాయి

**ప్రజాపక్షం/నెక్కొండ:**తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ విద్యా పాలన లో మరో వినూత్న అడుగు వేసింది. రాష్ట్రంలోని 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న సుమారు 18లక్షల మంది విద్యార్థుల వార్షిక రిపోర్ట్ కార్డులను నేరుగా తల్లిదండ్రుల వాట్సాప్ నంబర్లకు పంపిస్తూ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటికే విద్యార్థుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించినట్లు వరంగల్ జిల్లా నెక్కొండ మండల విద్యాధికారి రవి నాయక్ తెలిపారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల విద్యా ప్రగతిని తల్లిదండ్రులు సులభంగా, వెంటనే తెలుసుకునే అవకాశం కలిగింది. పాఠశాలలకు వెళ్ళకుండా రిపోర్ట్ కార్డులు అందుకోవడం వలన సమయం ఆదా కావడంతో పాటు పారదర్శకత కూడా పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన ఈ డిజిటల్ చర్యపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యారంగంలో ఇటువంటి ఆధునిక మార్పులు మరింత అభివృద్ధికి దోహదం చేస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## సబ్సిడీ ఎరువులపై కట్టుదిట్టమైన నిఘా

**ప్రజాపక్షం/నెక్కొండ:**సబ్సిడీ ఎరువుల బ్లాక్ మార్కెట్, అధిక ధరల అమ్మకాలను అరికట్టేందుకు కేంద్ర ఎరువుల శాఖ రాష్ట్రాలకు కీలక మార్గదర్శకాలు జారీ చేసినట్లు నెక్కొండ మండల వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఎరువుల దుకాణాలపై నిరంతర నిఘా ఉంచి, పారదర్శక పంపిణీకి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో రైతులకు న్యాయమైన ధరలకు ఎరువులు అందుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజాపక్షం విలేకరికి ఈశ్వర్‌కు డాక్టరేట్ ప్రదానం

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** గ్రామీణ అభివృద్ధిలో సామాజిక సేవ, రైతుసాధికారత దిశగా కృషిచేస్తూ కేంద్ర, రాష్ట్ర పథకాల అమలులో తనదైన ముద్రను చాటుతున్న సిద్దిపేట జిల్లా అక్కన్నపేటకు చెందిన నారదాసు ఈశ్వర్‌కు యూనైటేడ్ అమెరికా యూనివర్సిటీ వారు ఢిల్లీలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవంలో ఘనంగా సత్కరించి గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. గ్రామీణ అభివృద్ధిలో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు.భాగస్వామ్యంతో నాబార్డు పథకాలు అమలులో భాగంగా తాను చేసిన పని తీరు అధ్యాయంపై గుర్తింపు నిస్తూ యూనివరిటీ పౌండర్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్, ఉపకులపతి అమృతవల్లి చేతుల మీదుగా ఈశ్వర్‌కు డాక్టరేట్ అందచేశారు. రాబోవు రోజుల్లో గ్రామీణ అభివృద్ధిలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు క ల్పించటంలో తోడ్పాడుతామన్నారు. ఈకార్యక్రమంలో యూనివర్సిటీ డిన్ డాక్టర్ చితరాల నాగేశ్వర్‌రావు. జాయింట్ డైరెక్టర్ ఆరీఫ్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై మద్దూరు పోలీసుల దాడి

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** సిద్దిపేట జిల్లా మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాలపల్లి గ్రామంలో ఆక్రమంగా పేకాట ఆడుతున్నా వారిపై పోలీసులు శనివారం దాడి చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల సముదాయం వద్ద మద్దూరు పోలీసులు నిర్వహించిన దాడిలో నలుగురిని అరెస్టు చేయగా, మరో నలుగురు పరారయ్యారని ఎస్ఐ ఎండి ఆసిఫ్ తెలిపారు. నిందితుల నుంచి 52 పేకముక్కలు, 900 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని, కే సు నమోదు చేసి దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. ఆక్రమ జూదాలపై క ఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

### చికిత్స పొందుతున్న మహిళకు ఫౌండేషన్ సభ్యులు పరామర్శిం

**ప్రజాపక్షం/కాటారం:**అనారోగ్యంతో యోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళను శనివారం నేతకాని సేన ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు.కాటారం మండలం పరికిపల్లి గ్రామానికి చెందిన బౌతు లక్ష్మి అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని యోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిసి పరామర్శించారు.ఈ సందర్భంగాఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గంట దేవదాస్ ధైర్యం చెప్పి మాట్లాడుతూ సమాజంలో వివిధ పరిస్థితుల్లో ఉన్న వారికి తమ బాద్యతగా అండగా నిలుస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బీరెల్లి మహేష్,గోగుల రాజేష్,గజ్జల రాజెందర్ పాల్గొన్నారు.

## ఝాన్సిరెడ్డి పరామర్శి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండల ఎస్సీ సెల్ అద్యక్షుడు ఇనుముల నాగరాజు తల్లి లక్ష్మి ఇటీవల మృతిచెందగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో వారి వెంట మండల కాంగ్రెస్ అద్యక్షుడు నల్ల శ్రీరామ్, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండగా కివి పబ్లిక్ స్కూల్ 24వ అన్యూవల్ డే సెలబ్రేషన్స్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతంలో గల కివి పబ్లిక్ స్కూల్ స్థాపించి 24 వసంతాలు పూర్తి చేసుకొని 25 వసంతంలోకి అడుగెడుతున్న సందర్భంలో పాఠశాల యొక్క 24వ యాన్యూవల్ డే సెలబ్రేషన్స్ ఉర్సుగుట్ట వద్ద గల ఆకుతోట కన్వెన్షన్‌లో అంగరంగ వైభవంగా కన్నుల పండగగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు, ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు పేద మధ్య తరగతికి చెందిన వారు ఉన్నత విద్య అభ్యసించడం కోసం ఒక చక్కటి పునాది ఏర్పాటు చేసే దిశలో పాఠశాల శిక్షణ ఒక చక్కటి పునాది ఏర్పాటు చేసే దిశలో పాఠశాల శిక్షణ వారికి అందుబాటులో ఉండే విధంగా, వారిని ఆల్ రౌండర్లుగా తర్పీదును అందించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న కాజిపేట సిఐ వడ్డే నరేష్ కుమార్ మాట్లాడుతూ అనంతరం రాష్ట్ర జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్నటువంటి విజయాలు, వారి యొక్క రిజల్ట్స్ చాలా అభినందనీయమని, ఇంకా ముమ్ముందు ఇంకా చాలా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, అకాడమిక్ కన్వీనర్ మడిపల్లి రాజు, నాగపురి కిరణ్, కూరపాటి మోహన్, బండి చక్రపాణి, వడిచర్ల ప్రసాద్, దడిగల రమేష్, శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## సమైక్య పోరాటంతో విజయం సాధించిన ఆర్టీసీ కార్మికులకు అభినందనలు



**ప్రజాపక్షం/ వరంగల్ :** న్యాయమైన డిమాండ్స్ సాధనకై జేఏసి నాయకత్వన ఐక్యంగా పోరాడి విజయం సాధించిన ఆర్టీసి కార్మిక సోదరీ సోదరులకు భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి జేఏసీ నాయకులతో 14 గంటల పాటు సుదీర్ఘ చర్చల అనంతరం ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణ, 11శాతం పిఆర్సి ఇచ్చేందుకు మిగతా డిమాండ్స్ అన్నింటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించడం ఇటు కార్మికులకు అ టు ప్రజానీకానికి ఎంతో ఊరట లభించిందన్నారు. యాజమాన్యం ప్రభుత్వము ఎన్ని బెదిరింపులు చేసిన అక్రమంగా అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేసిన మండుటెండలను సైతం లెక్కచేయక వివిధ రూపాలలో ఆందోళనలు పోరాటాలు నిర్వహించి విజయం సాధించిన ఈ సమ్మె ఆర్టీసీ కార్మిక పోరాట చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన వెంటనే చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించి ఉంటే సమ్మె చేసే పరిస్థితి వచ్చేది కాదన్నారు. సమ్మె వలన ఆర్టీసి కార్మికులు, లక్షలాదిమంది ప్రయాణికులు పడిన బాధలు వర్ణనాతీతమన్నారు. ఆలస్యంగా నైనా డిమాండ్స్ అంగీకరించి సమ్మెను పరిష్కరించిన ప్రభుత్వానికి, సంబందించిన అధికా రులకు, సమ్మెను బలపరిచి మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీలకు, వివిధ కార్మిక సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులకు ఆయన ఉద్యమాభినందనలు తెలిపారు.

## బిసి కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ పట్టణంలోని బిసి కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన 63 కెవిఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ కాలనీవాసుల దీర్ఘకాల సమస్య అయిన విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అప్పలరావుపేట ఫీడర్ నుండి నెక్కొండ ఫీడర్‌కు మార్పు చేసి ఇకపై 24గంటల నిరంతర విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడిఈవి శ్రీధర్, ఎలక్ట్రిసిటీ ఏఈ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయికృష్ణ,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రమేష్ యాదవ్, రామాలపు రాము, మౌటం కృష్ణం రాజు, నేతుల సారంగపాణి యాదవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యుత్ శాఖ సిబ్బంది, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంగదాంపల్లి భూతగాద విషయంలో రాజకీయ ప్రమేయం లేదు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట మైత్రివనం, రంగదాంపల్లి భూ తగాదా విషయంలో రాజకీయ ప్రమేయం లేదని..ఒక మంత్రి పేరు రావటం దురదృష్టకరమని బాధితులు తెలిపారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రంగదాంపల్లి, మైత్రివనం సమీపంలోని సర్వే నెంబర్ 974, 975, 978, 1005,1006 సర్వేనెంబర్లకు సంబంధించి గత కొంత కాలంగా వస్తున్న రాజకీయ ఆరోపణలు కేవలం తప్పుదారి పట్టించటానికి మాత్రమేనని, ఇందులో ఎవరి ప్రమేయం లేదన్నారు. తమకు చెందిన ఆస్తిని తామే ఇష్టపూర్వకంగా విక్రయించుకున్నట్లు తెలిపారు. రాగం మల్లయ్యకు ఐదుగురు కుమారులు ఉండగా వారి రెండవ కుమారుడు ఎల్లయ్య ఒక్కరు సిద్దిపేటలో నివాసం ఉండగా, మిగత నల్గురు వరంగల్‌లో నివాసం ఉన్నారన్నారు. 1992లో భూమి అసలు యజమాని రాగం మల్లయ్య చనిపోయేనాటికి సుమారు 28 ఎకరాల భూమి ఉందని అది ఐదుగురు కుమారులకు సమానంగా పంచి పాస్‌బుక్కులు ఇచ్చారన్నారు. సిద్దిపేటలో ఉంటున్న రెండవ కుమారుడు ఎల్లయ్య తనకు వచ్చిన ఐదేకరాలతో పాటు మిగిలిన నలుగురు కుమారులకు చెందిన ఆస్తిని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అమ్ముకున్నట్లు ఆరోపించారు. మిగిలిన నల్గురి కుమారులకు ఇక్కడ స్థలం లేదని గొడవలు పడ్డారన్నారు. మిగిలిన వారు తమకు సంబంధించిన భూమిని అధికారులకు సమర్పించి క్లియరెన్స్ ఆర్డర్ తీసుకున్నట్లు తెలిపారు. వరంగల్ పరిధిలో నివాసముంటున్నవారు ముగ్గురు కుమారులు 2007 సంవత్సరంలో తన అవసరం నిమిత్తం తమ వాటగా వచ్చిన భూమిని ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున ఆరు ఎకరాలు అమ్ముకున్నట్లు తెలిపారు. సిద్దిపేట పరిధిలోని రాగం మ ల్లయ్య ఆస్తిలో ఐదుగురు కుమారులకు సమాన వాట వుందని, మి గిలిన నలుగురు కుమారులతు తమ వాటాగా వచ్చిన భూమిని విక్రయించారన్నారు. ఇందులో ఏలాంటి రాజకీయ వత్తిడిలు లేవని స్పష్టం చేశారు. ఈసమావేశంలో బాధితులు రాగం వెంకటేశ్, రాగం ఆం జనేయులు, లెదండి సులోచన, ముద్దం లలిత, మదిరాని అనురాధ, రేవతి, తెల్జిరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భ్రమరాంబికా మాత అమ్మవారికి ఐదు తులాల బంగారు హారం సమర్పణ

**ప్రజాఫక్షం/రాంచంద్రాపురం :** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంభిక సహిత మల్లిఖార్జున స్వామి ఆలయంలో భ్రమరాంబికా మాతకు భక్తులు ఐదు తులాల బంగారం హారాన్ని సమర్పించారు. రామచంద్రాపురం మల్లిఖార్జున నగర్ కాలనీకి చెందిన ముక్కిరాల పద్మనాభారావు శారదా దేవి, దంపతులు ముక్కిరాల మదన్ మోహన్‌రావు ,గిరిజా దేవి దంపతులు తమ మొక్కు తీర్చుకునేందుకు ఈ బంగారు హారాన్ని అమ్మ వారికి ఆలయ చైర్మన్ బైంసా సుదాకర్ యాదవ్ కార్యనిర్వాహణాధికారి శశిదర్ గుప్త సమక్షంలో ఈ హారాన్ని అందజేశారు. బీరం గూడ ఆలయం మరో శ్రీశైలంగా ప్రసిద్ధి చెందగా ఇక్కడ వెలసిన భ్రమరాంబికా దేవి కోరిన కోరికలను తీర్చే కల్పవల్లిగా భక్తుల విశ్వాసం , విశేష మహిమలతో ప్రసిద్ధి చెందిన మల్లిఖార్జున స్వామి భ్రమరాంబికా దేవి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని దాతలు ప్రార్ధించారు. ఈసందర్భంగా ఆయన చైర్మేన్ యాదవ్ మాట్లాడుతూ నిండు నిష్టతో భక్తులు ఏది కోరుకున్న కాదనకుండా తీర్చే దేవుడు ఆ శివయ్య అని అందరి సహకారంతో ఈ మల్లిఖార్జున స్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ఎంతగానో ప్రసిద్ధి గాంచిందని ఈ ఆలయంలో విశిష్ట దినాలలో ప్రత్యేక పూజలు ప్రతి సోమవారం నాడు అన్న దానా కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయని ఆలయాభివృద్ధికి భక్తులు తొడ్పడుతూ స్వామి వారి కృపాకటాక్షలకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు ,దేవాదాయ శాఖ అధికారి మల్లిఖార్జున రెడ్డి, ముఖిరాల వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 17వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### మున్సిపల్ కౌన్సిలర్ కె. వెంకటేష్ నాయక్

**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** ఇస్నాపూర్ మున్సిపాలిటి పరిధిలోని 17వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేట్టినట్లు వార్డు కౌన్సిలర్ కె. వెంకటేష్ నాయక్ తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఆయనకాలనీలో కొత్త వాటర్ లైన్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. గత కొంత కాలంగా తాగునీటి సరఫరా సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని పనులను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వాటర్ లైన్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కె. వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడం నా భాద్యత పనులు పూర్తియ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందిస్తాను ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటాను అని తెలిపారు. స్థానిక ప్రజలు పనులు ప్రారంభమైనందుకు సంతోషం వ్యక్తం చేస్తు వీలైనంత త్వరగా పూర్తిగా త్వరగా పూర్తి చేసి నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని కోరుతున్నారు.

## మద్యం నియంత్రణే లక్ష్యంగా బెల్ట్ షాపుల నిషేదం

**ప్రజాపక్షం/ కమలాపూర్:**బెల్ట్ షాపులతో యువతతో పాటు అనేక మంది మద్యానికి బానిసలు అవుతున్నారని, మద్యం నియంత్రణ వల్లే కుటుంబాలు బాగుపడతాయనే ఉద్దేశ్యంతో కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతి పరిధీలో బెల్ట్ షాపులు నిషేదిస్తూ గ్రామపంచాయతి పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. శనివారం గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో గ్రామంలోని తాగునీరు, పారిశుధ్యం సహ పలు సమస్యల పరిష్కారం కోసం చర్చ నిర్వహించి పలు అభివృద్ధి పనుల కోసం తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ.... గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహించడం మూలంగా అనేక అనార్ధాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగిస్తూ మద్యం సేవించే పేదల పై భారం వేస్తున్నారని అన్నారు. సమయపాలన లేకుండా రాత్రి,పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు సాగించడంతో సులభంగా మద్యం లభించడంతో విచ్చలవిడిగా మద్యం సేవించి అనేక మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. బెల్ట్ షాపులతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అబ్కారీ అధికారులు స్పందించి కమలాపూర్ పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని అమలు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.